తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## బ్రహ్మోత్సవాలకు రండి

### రాష్ట్ర గవర్నర్ జస్టీస్ నజీర్‌కు ఆహ్వానం



తిరుమల, సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి: నాలుగురోజుల్లో తిరుమలేశునికి జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్ జస్టీస్ అబ్దుల్‌నజీర్‌ను ఆహ్వానించారు. బుధవారం సాయంత్రం విజయవాడలోని గవర్నర్‌ను టిటిడి ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి కలసి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను అందజేశారు.

## మంత్రి పెద్దిరెడ్డిని అడ్డుకున్న అధికార పార్టీ సర్పంచ్ భార్య గ్రామస్తులు

ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు చేస్తున్న సొంత పార్టీ నేతలపై ఫిర్యాదు !!





మంత్రి కారును అడ్డుకున్న సర్పంచ్ భార్య, మంత్రి కాన్వాయ్‌ను చుట్టుముట్టిన గ్రామస్తులు

శాంతిపురం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త

తమ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు చేస్తున్న సొంత పార్టీ నేతలపై చర్యల కోసం ఏకంగా అధికార పార్టీ సర్పంచ్ భార్య, గ్రామస్తులు రాష్ట్ర పంచాయతీ రాజ్, గనులు, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కారును అడ్డుకుని రోడ్డుపై ధర్నా చేపట్టిన సంఘటన కలకలం రేకెత్తించింది. ఈసంఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని మొరసనపల్లి - కనమలదొడ్డి మధ్య కుప్పం - పలమనేరు జాతీయ రహదారి పక్కనే సర్వే నెం 26/11లో కోట్ల విలువ చేసే 64 సెంట్ల భూమి కలదు. ఈ భూమిని వారపుసంత నిర్వహణ, ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు కేటాయించాలని మొరసనపల్లి పంచాయతీ ప్రజలు, అధికార పార్టీ సర్పంచ్ జగదీష్, ఎంపిటిసి ఆర్ముగం, గ్రామస్తులు గత కొంతకాలంగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఇదే సమయంలో ఏడోమైలుకు చెందిన అధికార పార్టీ నేత దండపాణి, కర్లగట్ట పంచాయతీ ప్రీతిచామనూరుకు చెందిన కె.రామచంద్రప్పలు ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు చేపట్టారని గ్రామస్తులు మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకుని జాతీయ రహదారిలో ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న రాళ్లబూదుగూరు ఎస్సై మునస్వామి తన సిబ్బందితో వచ్చి రోడ్డుపై ధర్నా చేయరాదని పేర్కొన్నారు. అయితే ఒక్కసారిగా మంత్రి కాన్వాయ్ రావడంతో గ్రామస్తులు చుట్టుముట్టారు. సర్పంచ్ భార్య ఏకంగా మంత్రి వాహనం ముందర నిలబడడం స ంచలనం కలిగించింది. ఎమ్మెల్సీ భరత్ అక్కడున్న గ్రామస్తులకు నచ్చజెప్పే యత్నం చేశారు. దీంతో ప్రజలు దండపాణి ఎమ్మెల్సీ భరత్ అండతోనే రెచ్చిపోతున్నాడని నినాదాలు చేశారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి సర్పంచ్, ఎంపిటిసిలను కుప్పం ఆర్‌అండ్‌బి అతిథిగృహంకు రావాలని చెప్పడంతో ప్రజలు ఆక్రమణకు గురైన స్థలం పరిశీలించాలని మంత్రిని గ్రామస్తులు పట్టుబట్టారు. అయితే మంత్రి కాన్వాయ్ వెళ్లిపోవడంతో గ్రామస్తులు ఆగ్రహించారు. అవసరమైతే పంచాయతీలో ఉన్న వైకాపా నేతలు, కార్యకర్తలు రాజీనామా చేస్తామని పేర్కొన్నారు. దీంతో సర్పంచ్, ఎంపిటిసిలు మాట్లాడుతూ మంత్రి ఆర్డీఓను పంపుతానని చెప్పారని ఎవరూ తొందరపడవద్దన్నారు. గ్రామస్తులు అక్రమ కట్టడాలు కూల్చేయత్నం చేయగా సర్పంచ్ వారించారు. కాగా అధికార పార్టీ నేతలే ప్రభుత్వ భూమి స్థలంలో రెండు వర్గాలుగా చీలిపోవడం, మంత్రి పెద్దిరెడ్డిని ఓవర్గం అడ్డుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# ప్రతి భక్తునికి సంతృప్తికరంగా దర్శనం

### భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు - జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్





బ్రహ్మోత్సవాల ఏర్పాట్లుపై జరిగిన సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్, పక్కన ఎస్పీ, ఎమ్మెల్యే బాబులు. దేవస్థానం వద్ద చేపట్టిన ఏర్పాట్లును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

కాణిపాకం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల విజయవంతంకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సంతృప్తికరంగా స్వామివారిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ అన్నారు. కాణిపాకం దేవస్థానంలో ఈనెల 18 నుండి జరుగనున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపడుతున్న ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో కలెక్టర్ సగిలి షన్మోహన్, జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబులతో కలసి బుధవారం ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాణిపాకం ఆలయంలో ఈనెల 18 నుండి 21 రోజుల పాటు జరిగే స్వామివారి బ్రహ్మో త్సవాల సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆయా శాఖల అధికారులు వారికి కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వర్తించి కనీస వసతులు కల్పించాలని ఆయా శాఖలను ఆదేశించారు. ఇందులో భాగంగా భక్తలకు తాగునీటి వసతి, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పారిశుద ్య పనులను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించాలని కలెక్టర్ డీపీఓ లక్ష్మీని ఆదేశించారు. సమావేశం అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ బ్రహ్మోత్సవ ఏర్పాట్లుపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఉత్సవాల్లో ముఖ్యమైన ఉత్సవ రోజులు వినాయకచవితి, రథోత్సవం, పుష్పపల్లకిసేవ, తెప్పోత్సవం రోజుల్లో వేకువజామున 4 నుండి 6 వరకు స్వామివారికి అభిషేకం, 6 నుండి రాత్రి 11 వరకు భక్తులకు సర్వదర్శనం వుంటుందని తెలిపారు. అలాగే మిగిలిన ఉత్సవ రోజుల్లో ఉదయం 4 నుండి రాత్రి 10 గంటల వరకు భక్తులకు దర్శనం వుంటుందని కలెక్టర్ షన్మోమన్ తెలిపారు. జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేకంగా సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే ఎంఎస్.బాబు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి భక్తునికి సంతృప్తికరంగా స్వామివారి దర్శనం కల్పించే విధంగా దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, చిత్తూరు ఆర్డీవో రేణుక, డీపీఓ టి.లక్ష్మీ, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం జితేంద్రనాథరెడ్డి, ఈఈ వెంకట నారాయణ, తహశీల్దార్ సుశీల, ఎంపీడీఓ నాగరాజు, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, రూరల్ సీఐ రవి శంకర్‌రెడ్డి, స్థానిక ఎస్సై శ్రీనివాస్, ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ, కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ఇన్‌చార్జి ప్రధాన అర్చకులు సోమశేఖర్‌గురుకుల్‌లతో పాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఏర్పాట్లు పరిశీలన**

కాణిపాకం దేవసా ్థనంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం దేవస్థానం చేపట్టిన ఏర్పాట్లును జిల్లా కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, స్థానిక శాసనభ్యులు ఎంఎస్.బాబులు బుధవారం పరిశీలించారు. ప్రధాన ఆలయంలో ఏర్పాటు చేస్తున్న కూలైన్లు, లడ్డూ ప్రసాద వితరణ కేంద్రాలు, స్వామివారు ఊరేగే రథం, రథోత్సవం నిర్వహించే మాఢా వీధులు,ఆలయ పరిసరాలను వారు పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాట్లుపై కలెక్టర్, ఎస్పీలు దేవస్థానం అధికారులకు పలు సూచనలు చేశారు.

## ప్రతి గ్రామం అభివృద్ధి పథం

### - మంత్రి రోజా
### దామరపాకంలో ఒకే ప్రాంగణంలో 90 లక్షల మేర అభివృద్ధి పనుల ప్రారంభం



దామరపాకంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

నగరి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:

ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తోందని ప్రస్తుత ప్రభుత్వంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలే ఇందుకు తార్కాణమని మంత్రి రోజా అన్నారు. బుధవారం మండలంలోని దామరపాకం గ్రామంలో ఒకే ప్రాంగణంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.8లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లీనిక్ అంటూ రూ.90 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆమె ప్రారంభించారు. ఇంతటి అభివృద్ధిని తమ గ్రామానికి చేసిన మంత్రికి స్థానికులు గజమాలలు, శాలువలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి పదాన్ని మాటల్లో మాత్రమే చెబుతూ వచ్చేదన్నారు. గ్రామ స్థాయిలో ఎలాంటి అభివృద్ధి పనులు జరిగిన దాఖలాలు లేవన్నారు. ప్రజా ధనాన్ని ఎలా కొల్లగొట్టాలి అనే దృక్పథంతోనే పార్టీ అధినాయకుని నుంచి క్షేత్ర స్థాయి నాయకుల వరకు అవలంభించారన్నారు. ప్రజల చెంతకే పాలనను జగనన్న తీసుకెళ్లారన్నారు. గ్రామంలోని రైతులకు పరిపాలనకు సంబంధిత సమస్యల పరిష్కారానికి సచివాలయం, వ్యవసాయ సంబంధిత సమస్యల పరిష్కారానికి రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య రక్షణకు వెల్‌నెస్ సెంటర్, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. సచివాలయ పరిధిలోని దామరపాకం, అయనంబాకం గ్రామాలకు సచివాలయం ద్వారా సేవలు అందుతోందన్నారు. ఇలా మంచి చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఢిల్లీ, ఎంపీటీసీ జ్యోతి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, పీఆర్ డీఈ సుబ్బరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సతీష్‌కుమార్, సీడీపీవో కృష్ణవేణి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, పార్టీ నాయకులు హరిరెడ్డి, అరుణాచలం, సత్య, రవి, రమేష్, సోమనాథం, ఏళుమలై తదితరులు పాల్గొన్నారు.

## 15 నుండి జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే

### - 30 నుండి మెడికల్ క్యాంపులు ప్రారంభం
### - వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం జగన్మోహన్‌రెడ్డి

చిత్తూరు, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:

ప్రజలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచిత వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి బుధవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబుతో కలిసి కలెక్టర్లు, డిఎంహెచ్‌ఓలు, ఐసిడిఎస్ పిడిలు, ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిత్తూరు నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ సగిలి షన్మోహన్, డిఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభావతిదేవి, జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, మెప్మా పిడి రాధమ్మ, మున్సిపల్ కమీషనర్లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 98 లక్షల వివిధ రకాల సర్టిఫికేట్లను ప్రజలకు ఉచితంగా అందించడం జరిగిందన్నారు. ఈ నెల 15వ తేదీ నుండి వాలంటీర్లు, గృహ సారధులు, ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటికి వెళ్ళి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ నెల 16వ తేదీ నుండి ఎఎన్ఎంలు, సిహెచ్‌ఓలు, ఆశావర్కర్లు ప్రతి ఇంటికి వెళ్ళి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని ఆ సమస్యలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో అదనంగా 200 సిసికెమెరాలు

### నిరంతరం డేగకళ్ళతో నిఘా -తిరుపతి జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి



తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామికి మొదలు కానున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో పోలీసు విధుల్లో భాగస్వాము లవుతున్న అధికారులు, సిబ్బంది భక్తుల భద్రతే ధ్యే యంగా పనిచేయాలని తిరుపతి జిల్లా ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి, టిటిడి సివిఎస్‌ఒ నరసింహకిశోర్ తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు ఉదయం, రాత్రి జరిగే స్వామివారి వాహనసేవల వీక్షణకు విచ్చేసే లక్షలాది మంది భక్తులతో సిబ్బంది మర్యాదగా, హుందాతనంగా ప్రవర్తించాలన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, భక్తుల భద్రతలో భాగంగా పార్కింగ్ ప్రాంతాలు, వసతి గృహ సముదాయాలు, తిరుమలలో క్యూలైన్లు, గ్యాలరీలు ,ప్రవేశ నిష్క్రమణ గేట్లను ఆయన పర్యటించి తనిఖీలు చేశారు. అదనంగా 200 సిసికెమెరాలు ఏర్పాటుచేసి నిరంతరం జాగరూకతతో వ్యవహరించాలన్నారు. ఈ తనిఖీల్లో అదనపు ఎస్‌పిలు, డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీనివాస సేతు ప్రారంభోత్సవానికి
# పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేయాలి
### కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త



తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ శ్రీనివాస సేతు పూర్తి ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి శ్రీనివాస సేతు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. బుధవారం ఈ నెల 18వ తేది విచ్చేస్తున్న ముఖ్యమంత్రి పర్యటనకు మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహించాల్సిన ఏర్పాట్లపై కమిషనర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రారంభోత్సవ ప్రదేశంలో విచ్చేసే విఐపిల కోసం వెయిటింగ్ పందిళ్ళు ఏర్పాటు చేయాలని, అవసరమైన సోపాలు, కూర్చీలు వెయించాలని వారికి అవసరమైన తాగునీరు, స్నాక్స్ ఏర్పాటు చేయించాలన్నారు. అదే విధంగా వాహనాల పార్కింగ్ కోసం మ్యాంగో మార్కెట్, మహిళా ప్రాంగణం, అర్బన్ హాట్ ప్రాంతాల్లో తగు ఏర్పాట్లు చేయించాలన్నారు. సమావేశంలో ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు కెఎల్ వర్మ, సేతుమాదవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, డిసిపి శ్రీనివాసులు రెడ్డి, ఎసిపి బాలసుబ్రమణ్యం, డిఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, సంజీవ్ కుమార్, మహేష్, నరేంద్ర, ఫైర్ అధికారి శ్రీనివాసరావు, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, సర్వేయర్ దేవానంద్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచెయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ జాతర ప్రజల పండుగ

### అక్టోబర్ 4, 5 తేదీల్లో జరగబోవు జాతరలో సామాన్య భక్తులకు ప్రాధాన్యత
### వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



వెంకటగిరి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన గ్రామశక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతర భక్తుల పండుగని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం వెంకటగిరిలోని నేదురుమల్లి భవనంలో అక్టోబర్ 4, 5 తేదీల్లో జరగబోవు గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఏర్పాట్లపై ఆర్డీవో కిరణ్‌కుమార్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డిలతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతలో సాంప్రదాయానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ జాతరలో అల్లర్లు జరగకుండా భారీ బందో బస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో పోలేరమ్మ ఆలయం ఈవో శ్రీనివాసులురెడ్డి, తహ సీల్దారు పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో వెంకటేశ్వర్లు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బట్టల దుకాణానికి నిప్పు

### రూ. 20 లక్షల విలువ గల బట్టలు దగ్ధం

తిరుపతి క్రైం, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త



తిరుపతిలోని గోవిందరాజు స్వామి గుడి పక్కనున్న జిఎస్ స్ట్రేట్‌లో బట్టల దుకాణానికి నిప్పు అంటుకున్న బట్టలు దగ్ధమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు వివరాల మేరకు బార్గవ్‌కు చెందిన బట్టల దుకాణంలో నిప్పు అంటుకుందని ఈ మేరకు 20 లక్షల విలువ గల బట్టలు దగ్ధమైందని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంతో పెనుప్రమాదం తప్పిందన్నారు. బాధితుడు భార్గవ్ ఈస్ట్ పోలీస్టేషన్‌లో రోహిత్ అనే వ్యక్తి షాపుకు నిప్పంటించిన్నట్లు ఫిర్యాదు చేసా డని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస రావు తెలిపారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓగా
# రామారావుకు అవకాశం?!



### ఆర్‌డిఓగా పెద్దిరాజు?!

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పరిపాలనను చక్కదిద్దుకునే ప్రయత్నంలో పరిపాలనలో అందరికి ఆమోదయోగ్యమైన అధికారులను తీసుకురావటంలో శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి కసరత్తు చేస్తున్నారు. ఆలయ పాలన, మున్సిపల్ పాలన రెండు కళ్ళుగా ఉన్నాయి. ఈ వ్యవస్థలను చక్కబెట్టుకునే ప్రక్రియ,ప్రయత్నాల్లో ఎంఎల్‌ఏ ఉన్నారు.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓగా ఆధ్యాత్మిక వాది,ధార్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ దిశ దేశ నిర్దేశం చేస్తున్న శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కె.యస్ రామారావు పేరును శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి మదిలో ఉన్నట్లు తెలిసింది. ఇక శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓగా కె వి సాగర్‌బాబు సుమారు 15 నెలల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఆర్‌జెసిగా ఉన్నారు. ఆయన పరిధిలో రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లోని ఆలయాలను పర్యవేక్షించాల్సి ఉంది.

**ఆర్‌డిఓగా పెద్దిరాజు:**

శ్రీకాళహస్తి రెవెన్యూడివిజనల్ అధికారిగా ప్రస్తుతం కె.యస్.రామారావు సమర్థవంతంగా పని చేస్తున్నారు.ఆయనను ఆలయ ఇఓగా నియమిస్తే ఆ స్థానాన్ని ఎవరికి ఇవ్వాలనే మీమాంసలో శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి గతంలో ఇక్కడి ఆలయంలో ఇఓగా సమర్థవంతంగా పనిచేసిన పెద్దిరాజును తెచ్చుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. కాగా పెద్దిరాజును ప్రస్తుతం శ్రీశైలం దేవస్థానం ఇఓగా నియమించారు.ఆయన ఇంకా ఇక్కడ బాధ్యతలు స్వీకరించలేదు.

## తిరుపతిరూరల్ మండలంలో
# ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం



తిరుపతిరూరల్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలంలో ప్రభుత్వ భూములు కనుమరుగైతున్నాయి. తిరుపతి పరిసర ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములపై భూ కబ్జాదారులు కన్నెసి, యదేచ్చగా అక్రమణలు చేస్తున్నారు. భూ ఆక్రమణలు రెవెన్యూ సిబ్బందికే తెలిసే జరుగుతున్నాయని స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది భూ ఆక్రమణదారులతో కుమ్మకైన భూ ఆక్రమణలు ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మండలంలోని 29 గ్రామ పంచాయతీలలో డికెటి, కాల్వ, అనాధీనం, కశంగడ్డ, కుంట పోరంబోకు, కాల్వపోరంబోకు, స్మశాన స్థలాలు ఇలా ప్రభుత్వ భూములన్ని అన్యాక్రాంతమైతున్నాయి. ప్రభుత్వ భూములు ఏ మాత్రం అక్రమణకు గురి అయ్యాయో పూర్తిగా తెలుసుకోవాలంటే గూగుల్ సర్వే చేస్తే పక్కా వివరాలతో అక్రమణలు ఏమేరకు జరిగాయో ఉన్నతాధికారులు తెలుసుకోవచ్చు. ప్రభుత్వ భూములను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న ఆక్రమణదారులకు అధికారులే నో-అబ్జెక్షన్ సర్టిఫికేట్స్ ఇవ్వడం యదేచ్ఛగా భూ కబ్జాదారులు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఒత్తిడి తాళలేక ఒకటి రెండు ఆక్రమణలు రెవెన్యూ సిబ్బంది తొలగించినప్పటికి...భూ కబ్జాదారులు యధావిధిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. తిరుపతిరూరల్ మండలం జరుగుతున్న భూ ఆక్రమణలపై ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేయాలని గతంలో మండల అధికారులు నిర్ణయం తీసుకున్నప్పటికి ఆచరణ చేపట్ట లేదు. అలాగే ప్రభుత్వ భూములలో నిర్మించిన ఇళ్లకు ఏలాంటి మౌళిక సదుపాయాలు కల్పించరాదనే నిర్ణయాన్ని కూడా అధికారులే తుంగలో తొక్కారు. అక్రమ నిర్మాణాలకు నో-అబ్జెక్షన్ సర్టిఫికేట్స్ ఇవ్వడంతో భూ అక్రమణదారులు యదేచ్ఛగా అక్రణలకు పాల్పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తిరుపతిరూరల్ మండలంలో ఉన్న ఖరీదైన భూములను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఎస్‌జిఎస్ కళాశాల విద్యార్థులకు జానపద నృత్యంలో ప్రథమ బహుమతి

**తిరుపతి(విద్య) సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:**



సెట్విన్,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు స్థానిక ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన యువజనోత్స వాలలో శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు సామూహిక జానపద నృత్య విభాగంలో పాల్గొని ఘన విజయంతో ప్రథమ బహుమతి సాధించారు.ఈ నృత్య విభాగంలో రమ్య,ప్రసన్న,సెల్వి,వేదవతి,రెడ్డి ఈశ్వర్,మనోజ్,రవితేజ, రాజశేఖర్‌లు తమ అద్భుతమైన ప్రదర్శనతో సభికులను ఆకట్టుకున్నారు.దీంతో వారి బృందానికి ప్రథమ బహుమతి లభించింది.ఈ నేపథ్యంలో నవంబర్ నెలలో జరగబోవు రాష్ట్ర స్థాయి పోటీలకు వారు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా॥వేణుగోపాల్‌రెడ్డి,సాంస్కృతిక విభాగం సంచాలకులు డా॥జె.కొండలరావు విద్యార్థులను అభినందించి ఆశీర్వదించారు.

## విద్యుత్ షాక్‌కు గురై యువకుడికి తీవ్ర గాయాలు

**పుత్తూరురూరల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:**



విద్యుత్ షాక్‌కు గురై యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం పుత్తూరు మండలంలోని శిరుగురాజుపాళెం పంచాయతీలో జరిగింది. వివరాలు ఇలా... పుత్తూరు మండలం శిరుగురాజుపాళెం పంచాయతీ పొట్టిగుట్టలు గ్రామంలో వీధి దీపాలు మరమ్మతులు చేసేందుకు సర్పంచ్ మురళి నారాయణవనం మండలం కల్యాణపురం గ్రామానికి చెందిన తులసి(20)ను సంప్రదించారు. ఈ మేరకు బుధవారం వీధి దీపాలు పొట్టిగుట్టలు గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై మూతి కాలిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. వీధి దీపాలు ఏర్పాటుచేసే సమయంలో ఎల్‌సీ తీసుకోకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు ఆ శాఖ అధికారులు పేర్కొంటు న్నారు. తీవ్రంగా గాయపడిన తులసిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు.

## నష్టపరిహారం చెల్లించక ఇల్లు ఖాళీ చేయమంటే ఎలా?

వి.ఎంపల్లిలో ఉద్రిక్తత

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**



నాయుడుపేట-పూతల పట్టు ఆరు లేన్ల రోడ్లు నిర్మాణానికి సంబంధించి భూసేకరణలో భాగంగా పట్టణంలోని వి.ఎంపల్లిలో ఓ దళిత నాయకుడు మునెయ్య ఇంటి స్థలాన్ని సేకరించారు. తమకు నష్టపరిహారం చెల్లించండి ఖాళీ చేస్తామని బాధితుల బాధలను కాంట్రాక్టు కంపెని పట్టించుకోక పోవటంతో మునెయ్య ఇల్లు ఖాళీ చేయలేదు.దాంతో బుధవారం ఉదయం నుంచి ఖాళీ చేయించుటకు పోలీసులు, న్యాయం చేయక ఖాళీ చేయమంటే మేము రోడ్డున పడాలా? అని బాధితులు వాదించుకోవటం చర్చనీయాంశంగా మారింది.తమకు నష్టపరిహారం చెల్లించమని కోరుతుంటే పట్టించుకోకుండా బలవంతంగా ఖాళీ చేయించుటకు కాంట్రాక్టర్ తమ పలుకుబడితో పోలీసులను తమపై ఉసి గొల్పటం న్యాయమా? అని మునెయ్య దంపతులు ప్రశ్నిస్తున్నారు. తమకు నష్టపరిహారం చెల్లించకుండా ఖాళీ చేయిస్తే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు.పోలీసుల మోహరించి ఖాళీ చేయించటానికి ప్రయత్నించినపుడు దళిత నాయకులు వారికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా గంధం చంద్రశేఖర్ మాట్లాడుతూ దళిత వర్గాలపై భౌతికదాడులు అధికమౌతున్నాయని ధ్వజమెత్తారు.

## పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఆర్‌డిఓ

**శ్రీకాళహస్తి రూరల్,సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**



జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కె యస్ రామారావు బుధవారం శ్రీకాళహస్తి మండంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. శ్రీకాళహస్తి మండలంలోని పలు ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఫిర్యాదులున్నాయి. ఈ నేపధ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలనలు జరుగుతున్నాయి. పోలింగ్ కేంద్రం రెండు కిలో మీటర్ల దూరంలో ఉండాలి.అయితే రాజుల పాళెం, పంగూరులకు సంబంధించి ఫిర్యాదులందాయని కాబట్టి అక్కడ పరిశీలించారు. అలాగే రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పోలీసు స్టేషన్లను కకూడా తనిఖీ చేసినట్లు ఆర్‌డిఓ రామారావు ప్రభాతవార్తకు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందినపుడు ఆర్‌డిఓ క్షేత్ర స్థాయిలోకి వెళ్ళి పరిశీలించటంతో రెవెన్యూశాఖపై జనానికి నమ్మకం కుదురుతుంది.

## పల్లంలో కళ్యాణోత్సవం:

**శ్రీకాళహస్తి రూరల్,సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయం చేపట్టిన ధర్మప్రచార మాసోత్స వంను సంబంధిత మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. బుధవారం ఏర్పేడు మండలం పల్లం గ్రామంలో శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రచార రథం వచ్చింది. ఈ సందర్భంగా గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల కళ్యాణం ఏర్పాటు చేసారు. గ్రామానికి అరుదుగా లభించిన అవకాశంతో గ్రామాన్ని నిత్యకళ్యాణం పచ్చతోరణంలా మార్చారు.పెళ్ళి సందడి చోటు చేసుకుంది. గ్రామంలో స్వామి అమ్మవార్ల కళ్యాణోత్స వంను కన్నుల పండువగా నిర్వహించారు. సంప్రదాయ బద్ధంగా కళ్యాణోత్స వం ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయ ఎఇఓగా ధనపాల్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయ ఎఇఒగా ధనపాల్‌ను బదిలి చేస్తూ దేవాదాయశాఖ ఉత్తర్వులు జారి చేసింది. సుమారు ఏడాదికి ముందు సాధారణ బదిలీల్లో ధనపాల్‌ను శ్రీశైలంకు బదిలి చేసారు.అయితే ఇక్కడ పరిపాలనా సౌలభ్యం కోసం ఇక్కడ నుంచి బదిలి అయిన అందరిని తిరిగి పంపాలని శాసనసభ్యుని అభ్యర్థన మేరకు అందరిని తిరిగి పంపారు.కానీ ధనపాల్ బదిలి మాత్రం జరగలేదు. అక్కడే పని చేస్తున్న ధనపాల్‌ను బుధవారం మళ్ళీ తిరిగి శ్రీకాళహస్తీశ్వరాలయానికి బదిలి చేస్తూ దేవాదాయశాఖ ఉత్తర్వులు జారి చేసినట్లు సమాచారం.

## ఇస్కాన్ పోటీల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి ప్రతిభ

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 13 ప్రభాతవవార్త**



పట్టణంలోని ముత్యాలమ్మగుడి వీధిలోని ఆక్స్ ఫర్డ్ పాఠశాల విద్యార్థి ఇస్కాన్ పోటీల్లో ప్రతిభ చాటినట్లు కరస్పాండెంట్ సి. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇస్కాన్ వారు నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి పోటీలు - 2023 సాంప్రదాయ దుస్తుల నందు విద్యార్థి ఎన్. ధృవ(4వ తరగతి) ఆకట్టుకుంది. ఈ మేరకు విద్యార్థిని కరస్పాం డెంట్ మరియు ఉపాధ్యాయులు అభినందించారు.

## 11 మంది పేకాటరాయుళ్ళు అరెస్టు

**శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**

మండలంలోని ఇలగనూరు వద్ద పేకాట ఆడుతున్నారన్న రహస్య సమాచారంతో శ్రీకాళహస్తి రూరల్ సిఐ అజయ్‌కుమార్ పేకాటస్థావరాలపై దాడి చేసి 11 మందిని అరెస్టుచేసి వారి వద్ద నుండి రూ. 41వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## నూతన పెన్షన్లు పంపిణీ

**శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**

మండలంలోని వేలవేడు సచివాలయం పరిధిలో వైస్ ఎంపిపి ఎ.భానుమతి ఆధ్వర్యంలో నూతన పెన్షన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదేశముల మేరకు అర్హులైన వారికి వేలవేడు సర్పంచ్ బాలమ్మ ఆధ్వర్యంలో కొత్త పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సిపి పార్టీ నాయకులు వెంకటరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటర్లీ తదితరులు పాల్గొన్నారు.

## తొట్టంబేడు మండలంలో నాభూమి-నాదేశం కార్యక్రమం

**తొట్టంబేడు, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**



రాజకీయాలకు కులమతాలకు అతీతంగా దేశభక్తిని పెంపొందించే విధంగా దేశ ప్రధాని నరేంద్రమోడీ పిలుపుతో రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సూచనల మేరకు 'మనమట్టి-మన దేశం' అన్న దిశగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరు సంస్మరణార్థం కోసం బుధవారం మండలంలోని చియ్యవరం పంచాయతీ పోలింగ్ బూత్ నంబర్ 256 మరియు 257 బూతు కమిటీ సభ్యులు చిత్తుకాటు బాలాజీ, కాశీరాజనాల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామాల్లో నుంచి దేశభక్తితో మట్టిసేకరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ ఆచార సంప్రదాయాల ప్రకారం దేశంకోసం ప్రాణత్యాగం చేసిన వీరుల సంస్మరణార్థం డిల్లీలో అమృతవాటిక నిర్మాణం కోసం మట్టిని సేకరిస్తున్నామన్నారు. మనభూమి మనదేశం భారత్‌మాతాకీ జై అన్న నినాదాలతో బిజెపి నేతలు ప్రతి ఇంటికి వెళ్లి మట్టిని సేకరించారు. కార్యక్రమంలో నాయకులు నియోజకవర్గ పార్టీ కో కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వేదాంకృష్ణయ్య, కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి కందాటిసుబ్బరామిరెడ్డి, ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి పెద్దపాళెం రవి ఆచారి, దళిత మోర్చా నేత ఎం.వాసు, ఓబిసి మోర్చా మండల అధ్యక్షురాలు పుచ్చకాయలరమేష్‌యాదవ్, చొక్కాని రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిటిసి సి.ఎం.కేశవులుకు చెవిరెడ్డి లక్ష్మీ పరామర్శ

ఆత్మీయ అనుబంధం కలిగిన ఉష మరణం పట్ల కంటతడి

**చంద్రగిరి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:**



మాజీ ఎంపిటిసి, డాక్యుమెంట్ రైటర్ (బుజ్జి) సి.ఎం.కేశవులు సతీమణి శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలక మండలి సభ్యురాలు దివంగత సి.ఉష మృతి పట్ల ఆవేదన వ్యక్తం చేసిన ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి ఆయనను పరామర్శించారు. కొత్తపేటలోని బుజ్జి నివాసానికి చేరుకున్న ఆమె ముందుగా ఉష చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ప్రతి పుట్టిన రోజున, పెళ్లి రోజున, పండుగ రోజులలో తన కుటుంబంతో కలిసి మా ఇంటికి వచ్చి మాతో సంతోషంగా గడిపే ఉష ఇక లేరనే వాస్తవాన్ని జీర్ణించుకోలేపోతున్నట్లు కంటతడి పెట్టారు. ఉష మరణం పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బుజ్జి తల్లి సుశీలమ్మ, జడ్పీటిసి యుగంధర్ రెడ్డి, అగరాల దేవారెడ్డి, చేగు గోవర్ధన్ గుప్తా, మాజీ వార్డు సభ్యురాలు,శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలక మండలి మాజీ సభ్యురాలు లక్ష్మీ, ఈశ్వరమ్మ, సుబ్రమణ్యం,జ్యోతి,ఏ.శీను,కోలామల్లికార్జున్,నరేష్,త్రివేణి,శ్రీనివాసనిలయంటీమ్, పాల్గొన్నారు.

## ఆదర్శవంతంగా అనుప్పల్లి పంచాయతీ

వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:**



అనుప్పల్లి పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా మని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అన్నారు. బుధవారం అనుప్పల్లి పంచాయతీలోని అనుప్పల్లి, గడ్డక్రిందపల్లి, రేకలచేను గ్రామాలలో గడపగడపకు హర్షిత్ రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్ళి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంతమైన నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తామన్నారు. రానున్న సాధారణ ఎన్నికలలో మా అన్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఎంఎల్ఏగా గెలిపించాలని అభ్యర్ధించారు. అంతకుముందు నెమళ్ళగుండ్ల పల్లి నుండి అనుప్పల్లి వరకు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఇన్‌చార్జ్ గణపతి నాయుడు, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ కన్వీనర్లు శిరిపిరెడ్డి సతీష్ కుమార్ రెడ్డి, కేశవులు రెడ్డి, యశ్వంత్ రెడ్డి, నాయకులు శిరిపిరెడ్డి దేవరాజుల రెడ్డి, నిర ంజన్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, నాదముని, శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మోహిత్‌రెడ్డి ప్రజాసేవకై వచ్చాడు... .ఆశీర్వదించండి

-గడప గడప ఆత్మీయ పలకరింపులో చెవిరెడ్డి లక్ష్మీ

**తిరుపతిరూరల్, సెప్టెంబర్13 ప్రభాతవార్త:**



చంద్రగిరి ఎమ్మెల్యేగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గెలిపించాలని చెవిరెడ్డి లక్ష్మీ కోరారు. ప్రజాసేవకై వచ్చిన మోహిత్‌రెడ్డిని మీ బిడ్డగా ఆదరించి...ఆశీర్వదించి.. అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బుధవారం తిరుపతిరూరల్ పాతకాల్వ గ్రామ పంచాయతీలో గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి లక్ష్మీ మాట్లాడుతూ ఉన్నత ఆశయాలతో ప్రజాసేవకై వస్తున్న యువకుణ్ణి ఆదరించాలని, తండ్రికి తగ్గా తనయుడుగా అభివృద్ధి అజెండగా సైనికులా పని చేయడానికి మోహిత్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. సి.యం. జగనన్న సహకారంతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రతి పల్లెలో అభివృద్ధి పనులకు నాంది పలికారని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో చంద్రగిరి ఎమ్మెల్యేగా మోహిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

## జైలులో ఉన్న తెదేపా నేతకు పరామర్శ

**సత్యవేడు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ తెదేపా శ్రేణులు నిరసనలు వ్యక్తం చేశాయి. ఈక్రమంలో కేవిబిపురం మండలం ఆరె గ్రామానికి చెందిన జయరామి రెడ్డి తమపార్టీ అధినేత అక్రమ అరెస్ట్‌పై నిరసన వ్యక్తం చేయగా పోలీస్‌లు అరెస్ట్ చేసి శ్రీకాళహస్తి సబ్‌జైలుకు రిమాండ్ చేశారు. బుధవారం నియోజకవర్గ బీసి సెల్ అధ్యక్షుడు పరంధామ నాయుడు, నాయకులు లక్ష్మీపతి రాజు, దయానిధి, నరేంద్ర, పృధ్వి అక్కడకు చేరుకుని రిమాండ్‌లో ఉన్న తమ పార్టీ నేతను పరామర్శించారు.అధికార పార్టీ చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని, రానున్న కాలంలో తెదేపా ప్రజల ఆమోదంతో ఆరాచక పాలనకు చరమగీతం పాడనుందని ధీమా వ్యక్తం చేశారు.

## తెదేపా అధినేత అరెస్ట్‌కు నిరసనగా రిలేదీక్షలు

**సత్యవేడు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :**

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌ను వ్యతిరేఖిస్తూ బుధవారం సత్యవేడులో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ హెలెన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రోజుకు ఒక మండలం చొప్పున పార్టీ శ్రేణులు నియోజకవర్గం కేంద్రంకు చేరుకుని రిలే దీక్షల్లో పాల్గొననున్నట్లు ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న తెదేపా జిల్లా అధ్యక్ష్యులు నరసింహా యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్యాయం రాజ్యం మేలుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాగలాపురం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, ప్రదాన కార్యదర్శి పార్థీబన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ అసోసియేషన్ వితరణ

**నగరి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:**

గంగజాతరను పురస్కరించుకుని ప్రతి ఏడాది స్థానిక ఎలక్ట్రికల్ అసోసియేషన్ వారు అధ్యక్షుడు ఎన్.సి.ఆనందకుమార్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. 18వ ఏడాది వారు జాతర నిర్వహణ ప్రాంతం వద్ద మజ్జిగపంపిణీ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారిని చూడడానికి విచ్చేసే భక్తులకు ఎలక్ట్రికల్ అసోసియేషన్ వారు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉచితంగా మజ్జిగపంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కె.ఏ.కుమార్, ఏ.ఎస్.రవి, దామోధరం, ప్రభు, అన్బురాజు, అరుణ గిరి, హేమాద్రి పాల్గొన్నారు.

## పేదలను ఆదుకుంటున్న జగనన్నను ఆదరిద్దాం

: జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ సుమన్

**నారాయణవనం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త :**



పేద ప్రజలకు అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేద్దామని జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ తెలిపారు. మండలంలోని భీమునిచెరువులో కొత్తగా మంజూరైన వివిధ రకాల ఫించన్లను ఆయన బుధవారం స్థానిక సచివాలయం కేంద్రంలో అందజేశారు. ఇప్పటికే పేద ప్రజలను ఆదుకోవడం కోసం కోట్లాది రూపాయాలను వెచ్చించారన్నారు. అనంతరం లబ్దిదారులకు ఫించన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి మురుగేశం, కె బాబు, పంచాయతీ కార్యదర్శి కిషోర్‌కుమార్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపిక

**తిరుపతి (క్రీడ), సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**

ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపిక ఈ నెల 17వ తేది నుంచి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం గ్రౌండ్ ఆవరణంలో ఉదయం 9 గంటలకు చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్స్, జూనియర్స్, సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు వెంకటస్వామి, చైర్మన్ రాఘవ రెడ్డిలు తెలిపారు. సెలక్షన్స్‌కి వచ్చి సబ్ జూనియర్ క్రీడాకారులు 2.1.2008 లోపు, జూనియర్స్ 2.1.2004 లోపు జన్మించి ఉండాలన్నారు. క్రీడాకారులు తమ యొక్క ఆధార్ కార్డు, బ్లడ్ గ్రూప్ తప్పనిసరిగా తీసుకురావలెనన్నారు. డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంకు చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట స్వామి చైర్మన్ రాఘవ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొంటారని చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ పి. బాలాజీ తెలిపారు. మరెన్ని వివరాలకు 7013754776, 9701247118 సంప్రదించాలన్నారు.

## "శ్రీవేంకటేశపదములు"పుస్తకావిష్కరణ

-స్వర్ణకంకణంతో ప్రముఖులకుసత్కారం

**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:**

ఏడుకొండల వేంకటేశ్వరస్వామి వైభవాన్ని తన సంకీర్తనలద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేసిన తాళ్ళపాక అన్నమాచార్యుల సంగీతామృతాన్ని మరింతగా జనబాహుళ్యంలోకి తీసుకెళతామని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చెప్పారు.టిటిడి ధార్మికప్రాజెక్టులు, శాంతా వసంత ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ముద్రించిన "శ్రీవేంకటేశ పదములు"పుస్తకావిష్కరణ బుధవారం ఉదయంమహతి కళాక్షేత్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా హాజరైన టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి అన్నమయ్య కీర్తనలు, సామాన్యజనానికి అర్థమయ్యేలా సంకీర్తనలు అందుబాటులో ఉంచడం గురించి వివరించారు. ఈ సందర్భంగా శాంతావసంతా ట్రస్ట్ తరపున వేటూరి ఆనందమూర్తి, గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, సాయికృష్ణయాచేంద్రలను టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి స్వర్ణకంకణంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాంతావసంతా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మవిభూషణ్ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, టిటిడి జెఇఒ సదాభార్గవి, గ్రంధ పరిష్కార కర్తలు వేటూరి ఆనందమూర్తి, సాయికృష్ణయాచేంద్ర, టిటిడి ఆస్థాన గాయకుడు గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్ల విభీషణశర్మ పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేసిన మేయర్

**తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**



ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని నగర మేయర్ డాక్టర్ శిరీష పేర్కొన్నారు. బుధవారం తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయం మేయర్ ఛాంబర్‌లో 27వ డివిజన్ సంబంధించి కొత్త పింఛన్లు మంజూరైన వాటిని లబ్ధిదారులకు నగర మేయర్ డాక్టర్ శిరీష అందజేసారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ ఫించన్లు ఉదయం 5 గంటల నుండి ఇంటి దగ్గర వెళ్లి తలుపు తట్టి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. వైఎస్ఆర్ పింఛన్ కానుక జనవరి ఒకటి నుంచి పెరిగిన వైఎస్ఆర్ పెన్షన్ కానుకను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందజేస్తున్నదని. పింఛన్, రైస్ కార్డులు, ఆరోగ్య శ్రీ పథకాలు ఎంపికైన వారికి ప్రతి నెల మొదటి రోజే లబ్ధిదారుల గడప ముందుకొచ్చి పింఛను అందిస్తున్నామని తెలియజేసారు. 27వ డివిజన్‌లో వృద్ధాప్యం పెన్షన్లు 126 మందికి, వితంతు పెన్షన్లు 90 మందికి, ఒంటిరి మహిళ పెన్షన్లు ఏడు మందికి, వికలాంగుల పెన్షన్లు 21 మందికి, కిడ్నీ పేషంట్లకి ఒక్కరికి ఇవ్వడం జరుగుతుందని, ఒక్క 27వ డివిజన్లోనే 245 మందికి పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ శిరీష వారితో పాటు భరణి యాదవ్, గీతా యాదవ్, చింత రమేష్, డివిజన్ కార్యదర్శి గోపాల్, సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## నిరాహారదీక్షలో టీడీపీ నాయకులు

**వడమాలపేట, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:**



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా టీడీపీ పార్టీ పిలుపు మేరకు బుధవారం వడమాలపేటలోని టీడీపీ నాయకులు నిరాహారదీక్ష చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరాహారదీక్షకు కూర్చున్నారు. నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తప్పుడు కేసులు పెట్టి చంద్రబాబునాయుడును అరెస్టు చేయడం జగన్మోహన్‌రెడ్డి అక్రమాలకు పరాకాష్ట అని విమర్శించారు. అనంతరం స్థానిక ఎస్ఐ రామాంజనేయులు నాయకులతో మాట్లాడి రిలే నిరాహారదీక్షను విరమింపచేసి సామియాని తొలగించారు. కార్యక్రమంలో నాయకులు చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి ధనంజయనాయుడు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, దాముయాదవ్, వెంకటయ్య, హేమావతి, రవిరెడ్డి, పెద్దబ్బరాజు, మణిరాజు, బత్తి నాయుడు, శేషాద్రియాదవ్, దేవా, వెంకటేశ్వరరావు, వెంకటేష్, దేవరాజు, హేమాద్రి నాయుడు, మునస్వామి, రాధాకృష్ణ, శివ రాయల్, వినోద్, చైతన్య, నవీన్, సురేష్, అయ్యప్ప, శ్రీనివాసులు, అంజయ్య, ఉమాపతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి 'జంప్ రోప్'లో మంగళం ట్రెండ్స్ విద్యార్థుల ప్రతిభ

**తిరుపతి(విద్య) సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:**



గత కొన్ని రోజుల క్రితం చిత్తూరు జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ఎంపికైన మంగళం ట్రెండ్స్ విద్యార్థులు..ఈనెల 9,10 తేదీలలో రెండు రోజుల పాటు గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన నాల్గవ రాష్ట్ర స్థాయి 'జంప్ రోప్' పోటీలలో పాల్గొని విశేష ప్రతిభ కనబరచి మొత్తం 7 పథకాలు సాధించారు.ఇందులో 2 బంగారు పథకాలు,2 వెండి పథకాలు,3 కాంస్య పథకాలు సాధించి,మంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రతిష్టను రాష్ట్ర స్థాయిలో నిలిపారు.విజయం సాధించిన వారిలో 10వ తరగతి చదువుతున్న రమ్యశ్రీ,మధుమిత(బంగారు పథకం)సంజనరెడ్డి,కావ్య(వెండి పథకం),జాహ్నవి (కాంస్య పథకం), 9వ తరగతి చదువుతున్న అభిశ్రీ,సాయి ధరమ్‌తేజ్(కాంస్య పథకం) ఉన్నారు. వీరందరూ వచ్చే నెల అక్టోబర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.కేశవులునాయుడు తెలిపారు.పథకాలు సాధించిన విద్యార్థులను హెచ్.ఎంతో పాటు ఫిజికల్ డైరెక్టర్లు రామకృష్ణ,సాంబశివరావు అభినందించారు.అలాగే పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జి.సుశీల,ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలియచేశారు.రానున్న జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచి మరిన్ని పథకాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని హెచ్ఎం కేశవులునాయుడు విద్యార్థులకు సూచించారు.

## పాస్టర్లకు గౌరవ వేతనమిచ్చి గౌరవించిన ఘనత సిఎం జగన్‌దే!

-ఏపీ బిషప్స్ కౌన్సిల్ చైర్మన్ డా॥యలమంచిలి ప్రవీణ్ హర్షం

**తిరుపతి(విద్య) సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:**



రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా పాస్టర్లను గౌరవించి వారికి గౌరవ వేతనం కల్పించిన ఘనత భారతదేశం మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ చైర్మన్ డా॥యలమంచిలి ప్రవీణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.సిఎం జగన్ తన లండన్ పర్యటన ముగించుకుని రాజధాని అమరావతికి రాగానే మొదటి సంతకం పాస్టర్లకు రెండవ విడత గౌరవ వేతనం పత్రాలపై సంతకం చేయడం పట్ల ఆయన తన హర్షాన్ని వ్యక్తంచేశారు.గతంలో ఎందరో ముఖ్యమంత్రులు మాటిచ్చి తప్పారు.అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగ్గా లేకపోయినా ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెల గౌరవ వేతనం 5 వేలు చొప్పున 5 నెలలకు రావాల్సిన 25 వేలను(ఒక్కొక్కరికి) రెండవ విడతలో అందేలా చేసిన సిఎం జగన్‌కు యావత్ క్రైస్తవ లోకం రుణపడి ఉంటుందన్నారు.

## 'బిగ్ బాస్' అసోసియేట్ స్పాన్సర్‌గా హైయర్ ఇండియా

**తిరుపతి(విద్య) సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:**




గృహోపకరణాలలో గ్లోబల్ లీడర్,హైయర్ అప్లయెన్సెస్ ఇండియా (హైయర్ ఇండియా) రియాలిటీ షో బిగ్ బాస్ తెలుగు సీజన్ 7 కోసం అసోసియేట్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు సతీష్ ఎన్ఎస్ తెలిపారు.బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టెలివిజన్ షోలలో ఒకటైన బిగ్ బాస్-7 తెలుగు షోను వినూత్నమైన పద్ధతులు అందరినీ ఆకర్షించేలా అందిస్తుందన్నారు.ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు,ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రేక్షకులు దీనిని ఆదరించడం అభినందనీయమన్నారు.సాంకేతికతతో నడిచే గృహోపకరణాలను అందించడం ద్వారా భారతీయ వినియోగదారుల రోజువారీ జీవితంలో భాగం కావడానికి హైయర్ ఎల్లప్పుడూ కృషి చేస్తోందన్నారు.అలాంటి సంస్థ బిగ్ బాస్-7ను సమర్పించి ప్రేక్షకులకు అందించడం శుభపరిణామమన్నారు.మా వినియోగదారులు,ప్రజలు ఈ కార్యక్రమాన్ని వీక్షించి ఆదరించాలని కోరారు.

## వైసీపీ ప్రభుత్వంలో అర్హులందరికి పింఛన్లు

**పుత్తూరురూరల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:**



వైసీపీ ప్రభుత్వంలోనే అర్హులందరికి పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందని పుత్తూరు మండలం రామసముద్రం సర్పంచ్ కుమార్ అన్నారు. బుధవారం రామసముద్రం గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పంచాయతీలో పాసింజ నిర్వహణ తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ప్రతి ఒక్కరు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషోర్, వైసీపీ నాయకులు రాజా, గ్రామస్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడల పట్ల మంచి భవిష్యత్ ఉంటుంది - ఎంఈవోలు

**పుత్తూరురూరల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:**



ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పుత్తూరు మండల ఎస్‌జీఎఫ్ సెలెక్షన్స్‌కు జీహెచ్ఎస్ ఎస్ఆర్ఎస్ ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యంలు పాల్గొని క్రీడలను ప్రారంభించారు. క్రీడల వల్ల మంచి భవిష్యత్ ఉంటుందని వారు తెలిపారు. బుధవారం జరిగిన బాలుర 17 సంవత్సరాల లోపు వాలీబాల్‌లో జడ్పీహెచ్ఎస్ పరమేశ్వరమంగళం, జడ్పీహెచ్ఎస్ కేబీఆర్ పురం సంయుక్త విజేతలుగా నిలిచారు. బాలుర 14 సంవత్సరాల లోపు విద్యార్థులకు గొల్లపల్లి, పరమేశ్వరమంగళం విజేతలుగా, 14 సంవత్సరాల బాలికల్లో గొల్లపల్లి, శేషసాయి విజేతలు, 14 సంవత్సరాల లోపు బాలికల టెన్నికాయిట్‌లో గొల్లపల్లి, గేటు పుత్తూరు విజేతలుగా నిలిచారు. కార్యక్రమానికి మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ నందకుమార్, మండల స్పోర్ట్స్ ఆర్గనైజర్ గోపీకృష్ణ, పీటీలు మోహన్‌బాబు,శివకుమార్, షమ్ సుద్దీన్, అరుణ, లక్ష్మి, సి.కె.బాబు తదితరులు పాల్గొన్నారు.

## బాలాజీ కుటుంబానికి సిపాయి భరోసా

**రేణిగుంట, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:**



రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ చెంగారెడ్డిపల్లె ఆర్ఆర్ కాలనీలో మృతి చెందిన దామోదర్‌రెడ్డి(బాలాజీ) కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ డా. సిపాయి సుబ్రహ్మణ్యం బుధవారం పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సిపాయి భరోసా ద్వారా ఆ కుటుంబానికి సంవత్సరానికి సరిపడే 40 రకాల నిత్యావసర సరకులను బాలాజీ తండ్రి కృష్ణారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో డా. బాబు, బలరామరెడ్డి, మునిరత్నంరెడ్డి, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

# సూళ్లూరుపేటలో టిడిపి నిరాహార దీక్షలు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ బుధవారం నిరాహార దీక్షలను ప్రారంభించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో దీక్షలను లాంఛ ంగా ప్రారంభించారు. ఈ సందర్భ ంగా నియోజకవర్గంలోని ముఖ్య నేతలు దీక్షలో పాల్గొన్నారు. ముందు గా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తమ నాయకుడికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతి పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు గొల్ల నరసింహయాదవ్, ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించారు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఎటువంటి ఆధారాలు లేకుండా చంద్రబాబునాయుడిని కక్షపూరితంగా అరెస్టు చేయడం అన్యాయం అన్నారు. చంద్రబాబునాయుడికి బెయిల్ వచ్చిన వెంటనే అందరికీ తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, వేనాటి జనార్ధన్‌రెడ్డి, కొక్కు శంకరయ్య, బుద్ధి విజయలక్ష్మి, పాకం వెంకటసుబ్బయ్య, బుజ్జయ్య, కామిరెడ్డి మురళీరెడ్డి, నీలకంఠం, కళ్యాణి, కృష్ణారెడ్డి, మనోహర్‌రెడ్డి, కృష్ణయ్య, విజయకుమార్, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, గండవరం రమేష్‌రెడ్డి, చెంచురామయ్య, జీవా, మెస్ రమణయ్య, బండారు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన టిడిపి ప్రజాదరణ... వైసిపిలో ఓటమి భయం : పులివర్తి నాని



చంద్రగిరి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త: శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలిగించకుండా ప్రశాం తంగా నిరాహాదీక్షలు చేపట్టాలని టిడిపి ఎంఎల్‌ఏ అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా తిరుపతి రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు పెరుమాళ్ పల్లి ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రూరల్ మండల నాయకులు ఉదయం నుండి సాయంత్రం వరకు నిరాహారదీక్ష చేపట్టారు. చంద్రబాబుకు తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం రిలే నిరాహార దీక్షలు అంటూ నిర్వహించిన కార్యక్రమం మొదటి రోజున విజయవంతమయ్యింది. ఈ కార్యక్రమానికి చంద్రగిరి మండల నాయకులు, కార్యకర్తలతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన నాయకులతో పాటు జిడి నెల్లూరు, తిరుపతి నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులతో పాటు పులివర్తి నాని తమ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్, గుజరాత్ సహా 7 రాష్ట్రాలలో ఎక్కడా అవినీతికి అవకాశం లేదని డిజి టెక్ కంపెనీ యాజమాన్యం చెబుతున్న మాటలు జగన్ చెవికెక్కడం లేదన్నారు. చంద్రబాబు అరెస్టను నిరశిస్తూ తెలంగాణాలో ఐటి ఉద్యోగులు రోడ్డుపైకి చేరుకుని ఆయన విజన్‌ను కొనియాడుతున్నట్లు గుర్తు చేశారు. నియంతపోకడలతో కంపెనీలను తరిమేస్తూ సైకో ఆనందం పొందుతున్న జగన్ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా వుండాలని భావించే చంద్రబాబును అవినీతిపరుడుగా చిత్రించాలని చూడటం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొందూరు ప్రవీణ్ రాయల్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా, పట్టణ అధ్యక్షుడు కాపువీధి సునీల్, నాయకులు వీరంగారి రమేష్ రెడ్డి, సక్కుర్ ధనంజయ రెడ్డి, కన్నయ్య నాయుడు, తులసి రెడ్డి, మండలం లోకేష్ రాయల్, పైడిపల్లి బాలా యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# జగన్ వ్యవస్థలను మేనేజ్‌చేసి... పథకం ప్రకారమే చంద్రబాబుపై తప్పుడుకేసు

### -చంద్రబాబుకు అండగా నిలబడదాం -టిడిపి రిలేనిరాహారదీక్షలు



తిరుపతి,సెప్టెంబర్ 13 ప్రభాతవార్త: రాష్ట్రంలో గత నాలుగన్నరేళ్ళుగా నియంతపాలన సాగిస్తూ, వ్యవస్థలను మేనేజ్‌చేసి ఒక పథకం ప్రకారం చంద్రబాబుపై తప్పుడుకేసు పెట్టి అరెస్టుచేశారని తెలుగుదేశం నాయకులు పేర్కొ న్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో నిజంగా అవినీతి, అక్రమం జరిగి ఉంటే జగన్ ప్రభుత్వంలో ఉన్న అప్పటి అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రజల్లో చంద్రబాబుకు, టిడిపికి ఆదరణ చూసి ఓర్వలేక జగన్ ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని నాయకులు ఆరోపించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ, బాబుకు తోడుగా తామంతా ఉన్నామని తెలియజేస్తూ తిరుపతిలో తెలుగుదేశం పార్టీ నాయకులు రిలేనిరాహారదీక్షలు తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ, పార్లమెంట్ ఇన్‌చార్జి నరసింహ యాదవ్, కార్పొరేటర్ ఆర్‌సి మునిక్రిష్ణ, రాష్ట్రకమిటీ నాయకులు సూరాసుధాకర్‌రెడ్డి, వి.పుష్పావతి యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, పులిగోరుమురళి, వట్టికుంట శంకరనారాయణ, ఊకా విజయ కుమార్, దంపూరి భాస్కర్, కంకణాల రజినీకాంత్ నాయుడు, బుల్లెట్‌రమణ, కుమారమ్మ, మౌలా. రాజుయాదవ్ తదితరులు నల్లదుస్తులు ధరించి భారీసంఖ్యలో రిలేనిరాహారదీక్షల్లో పాల్గొన్నారు. చంద్రబాబును జైలుకు పంపి జగన్, అనుచరులు శునకానందం పొందుతున్నారన్నారు. నిజాయితీ ఉన్న టిడిపి అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్టుచేయడం దారుణమని తెలుగుదేశం నేతలు అన్నారు. అనేక అవినీతి అక్రమ కేసుల్లో జైలుకెళ్లిన సిఎం జగన్ 16నెలలు జైల్లో ఉన్నాననే కుట్రతో, కక్షతో చంద్రబాబును జైలుకు పంపాలని అధికారులను ఆదేశించడం ఎంతవరకు న్యాయం అని ప్రశ్నించారు.రాబోయే ఎన్నికల్లో ప్రజలే వైసిపి పతనాన్ని చేస్తారని అన్నారు.

# జైలులో కూడా ప్రజా సంక్షేమం కోసమే ఆలోచిస్తున్న బాబు:బొజ్జల



తొట్టంబేడు, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : జైలులో ఉన్నా కూడా మాజీ ముఖ్య మంత్రి నారాచంద్రబాబు నాయుడు నిత్య ం ప్రజల సంక్షేమం కోసమే ఆలో చిస్తు న్నారని రాష్ట్రాభివృద్ధే ఆయన ధ్యేయం అని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఇలగనూరు గ్రామంలో 'బాబుగారికి తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం' అన్న నినాదంతో రిలేనిరాహారదీక్ష చేపట్టారు. కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాలి మురళీ నాయుడులు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మాజీ ఎంఎల్‌ఏ సత్రవాడ మునిరామయ్య, రాష్ట్ర కార్యదర్శి గుమ్మిడిపూడి దశరధాచారి, స్కిట్ మాజీ ఛైర్మన్ గురు దశరథన్, రాము, ఏర్పేడు మండల నాయకుడు ధనంజయులు నాయుడు. మాజీ పాలసరఫరా ఛైర్మన్ రావిళ్ళ మునిరాజ నాయుడు, తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, ఎస్సీ,ఎస్టీ సెల్ నాయకులు గోపి, సుబ్బయ్యలు పాల్గొన్నారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు అందరినీ చంద్రబాబు జాగ్రత్తగా ఉండమని యువగళం నేత యువనాయకుడు నారాలోకేష్‌కు చెప్పారని తెలిపారు. నేడు హైదరాబాదులో 72వేల పైచిలుకు ఐటి ఉద్యోగులు వివిధ ప్రాంతాల్లో ఉన్నారని వారు కూడా సోషల్‌మీడియాలో ఎవరి వల్ల ఉద్యోగం వచ్చిందో ట్వీట్ చేయాలన్నారు. తెలంగాణాలో కూడా ఐటి ఉద్యోగులు ధర్నా చేసినా వారిని కూడా పోలీసులు చెదరగొట్టారన్నారు. సైకో జగన్ మళ్లీ వస్తే రాష్ట్రంలోపాలన మళ్లీ రివర్స్ గేరులో పాలన సాగుతుందని దుయ్యబట్టారు. అందరు సంయమనం పాటించాలని కోరారు. నేడు రేణిగుంటలో, తర్వాత ఏర్పేడులోను, రూరల్‌లోను,అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించను న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఏ సత్రవాడ మునిరామయ్య, రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడిదశరధాచారి, స్కిట్ మాజీ ఛైర్మన్ గురుదశరథన్, రాము, ఏర్పేడు మండల నాయకుడు ధనంజయులు నాయుడు. మాజీ పాలసరఫరా ఛైర్మన్ రావిళ్ళ మునిరాజనాయుడు, తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్ నాయుడు, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, ఎస్సీ,ఎస్టీ సెల్ నాయకులు గోపి, సుబ్బయ్య, చక్రాల.ఉష, ఇందిరాపవార్, ఉమేష్‌రావు, భాస్కర్,మణి, ధనంజయులు నాయుడు, చిన్నారెడ్డి, పలువురు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త: ప్రధానమంత్రి ఆయుష్మాన్ భవ్ క్యాంపెయిన్ బ్యానర్, పోస్టర్‌ను జిల్లా కలెక్టరేట్ సచివాలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పేద, నిరుపేద కుటుంబాలకు వైద్య సౌకర్యం కల్పించే ఉద్దేశ్యంతో ప్రవేశ పెట్టిన పథకమని, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భవ్ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని అన్నారు. ఈ నెల సెప్టెంబర్ 17 నుండి దేశ వ్యాప్తంగా ఆరోగ్య, సంక్షేమ కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల వద్ద వారానికి ఒక సారి ఆరోగ్యమేళాలు నిర్వహించబడు తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలోఆయుష్మాన్ భారత్ యొక్క పెంపు ఆయుష్మాన్ ఆఫ్ కే ద్వారా 3.0 కింద ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజని అని అన్నారు.

# ప్రజల ఆరోగ్యానికి భరోసా-జగనన్న ఆరోగ్య సురక్ష : కలెక్టర్



వీడియో కాన్ఫిరెన్స్‌లోపాల్గొన్న కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : ప్రజా ఆరోగ్యానికి భరోసా కల్పించడం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ఆరోగ్య భరోసా కల్పించే విధంగా ఈ కార్యక్రమం రూపొందించడం జరిగిందని, అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని అన్నారు. అనంతరం కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుపై సంబంధిత అధికారులు బాధ్యతలపై శిక్షణ పూర్తి అయిందని, సంబంధిత గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో చేపట్టే షెడ్యుల్ సిద్ధం అయ్యాయని తెలిపారు. ఈ నెల 15న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పై గృహ సందర్శనతో అవగాహన కల్పించి క్యాంపెయిన్ ప్రారంభం అవుతుందని వాలంటీర్లు, ప్రజా ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో వారి పరిధిలోని గృహ సందర్శన చేసి ప్రజలకు ఈ కార్యక్రమం పై అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్ఎం, ఆశా, వాలంటీర్లు ఒక బ్యాచ్‌గా, సిహెచ్‌ఓ, వాలంటీర్లు, ఆశాలు మరొక బ్యాచ్‌గా గృహ సందర్శన చేసి ఇంటిలోనివారి సెల్ ఫోన్ నందు ఆరోగ్య శ్రీయాప్‌ను డౌన్లోడ్ చేసి దాని వినియోగం తెలియ జేయాలని అన్నారు. వైద్య శిబిరం నిర్వహణ పకడ్బందీగా చేపట్టా లని, దాని కొరకు తగినంత స్థలం అవసరమవుతుందని ఏదైనా పాఠశాల, కళాశాల ఆవరణలో నిర్వహించాలని సూచించారు. అక్కడ షామి యానా, త్రాగు నీరు సదుపాయాలు తదితర ఏర్పాటు ఉండే లా చూడాలని అన్నారు. వైద్య శిబిరంలో చికిత్స, మందులు ఉచితం గా అందజేయడం జరుగుతుందన్నారు. మార్గదర్శ కాల మేరకు జిల్లాలోని మండల, మున్సిపాలిటీ వారీగా అధికారులు సమన్వయంతో మండల స్థాయిలో ఎంపిడిఓలు, తహశీల్దార్లు, డాక్టర్లు, సిడిపిఓలతో కమిటీ ఏర్పాటుతో, అదే విధంగా జిల్లా స్థాయిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డిసిహెచ్‌ఎస్, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా అధికారి, వైఎస్‌ఆర్ ఆరోగ్య శ్రీ అధికారులతో కమిటీ ఏర్పాటుతో కార్యక్రమ పర్యవేక్షణ, అమలు, సమీక్ష ఉంటుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎంహెచ్‌ఓ శ్రీహరి, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, డిఈవో విశేఖర్, డిపిఎంఓ శ్రీనివాసులు, జిల్లా ఆరోగ్య శ్రీ సమన్వయకర్త రాజశేఖర్ రెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారిని సుశీల దేవిలు పాల్గొన్నారు.

# శ్రీ మల్లేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి



కుప్పం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త: గుడుపల్లె మండలం మల్లప్పకొండపై వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ నూతన కుంబాభిషేక కార్యక్రమంకు బుధవారం రాష్ట్ర అటవీ,గనులు, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా స్వామివారికి మంత్రి పెద్దిరెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వేదపండి తులు మంత్రి పెద్దిరెడ్డిని ఆశీర్వదించారు. మల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మంత్రి పెద్దిరెడ్డి సుమారు 1.30కోట్లు నిధులు దేవదాయ శాఖ ద్వారా మంజూరు చేయించడంతో పాటు కుంబాభిషేక నిర్వహణకు తనవంతుగా ఐదు లక్షల విరాళంను సైతం అందించిన విషయం విదితమే. అంతకుముందు మంత్రి పెద్దిరెడ్డికి కుప్పంలో ఘనస్వాగతం లభించింది. కార్యక్రమాల్లో చిత్తూరు ఎం.పి. నల్లకొండగారి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్, మాజీ టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్, ఎంపిపిలు వరలక్ష్మి, అశ్విని, జడ్పీటిసిలు కృష్ణమూర్తి, ఎడిఎస్ శరవణ, కన్వీనర్ రామకృష్ణ, కో కన్వీనర్ రామూర్తి, సర ్పంచ్ అమర్‌నాథ్, వేదబ్రహ్మశ్రీ బాలసుబ్రమణ్యశాస్త్రి, నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ద్రవిడ వర్సిటీ తాత్కాలిక ఉద్యోగులు మంత్రిని కలసి తమకు మూడు నెలలుగా వేతనాలు అందించలేదని వేతనాలు వచ్చేలా చూడాలని మంత్రిని కోరారు.

# పూలపల్లకీలో వైభవంగా ఊరేగిన అవనాక్షమ్మ అమ్మవారు



నారాయణవనం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచా యతీ కోటవీధిలో వెలసిన అవనాక్షమ్మ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవరోజు బుధవారం రాత్రి సెంగుంధర్‌మొదలియార్ కులానికి చెందిన భక్తులు అమ్మవారిని ట్రాక్టర్‌పై అమర్చి సుమారు 100 కిలోల పూలతో పూలపల్లకీలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అంతకుముందు అమ్మవారి ఆలయంలో శుద్ధి, అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో సుమనోహర ంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మొక్కుబడి కలిగిన భక్తులు టెంకాయహారుతులు, నైవేద్యం సమర్పించుకు న్నారు. కొంతమంది భక్తులు ఆలయం ఎదుట పొంగళ్లు పెట్టారు. కోటవీధి, ఏకాంబరకోటవీధి, చిత్రాంగికోట, రత్నాంగికోట, కొత్తకోట వీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల, భాణస ంచావేడుకల నడుమ ఘనంగా ఊరేగించారు. భక్తులు టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. భక్తులకు ప్రసాదాలను అందించారు.

# శ్రీశ్రీశ్రీ కట్ట పుట్టాలమ్మ జాతరలో శ్రీనాగాలమ్మ ఊరేగింపు



రేణిగుంట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడిలో కొలువు తిరిగి శ్రీశ్రీశ్రీ పుట్టాలమ్మ జాతర బుధ వారం వైభవంగా ముగిసింది. గతమూడు రోజులుగా అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తరపున ఆయన కుమార్తె మండల వైసీపీ ఇన్‌చార్జి పవిత్రరెడ్డి, శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్టు బోర్డు ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులతో కలసి అమ్మవారికి సారె సమర్పించారు. జాతరలో భాగంగా పంచాయతీ పరిధి దొడ్డమిట్ట గ్రామం ఆలయ ధర్మకర్త రామచంద్రయ్య వాసు ఇంటి నుంచి శ్రీ నాగదేవత(నాగాలమ్మ) బుధవారం వేకువ జామున ఊరేగింపుగా శ్రీ కట్ట పుట్టాలమ్మ దేవస్థానానికి బయలుదేరింది. దారి పొడవున నాగలమ్మకు భక్తులు మంగళ హారతులు సమర్పించారు. జాతర నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు జరగకుండా ఆలయ ఛైర్మన్ ధనంజయులు, మధు, శేఖర్, తేజ, మహేష్, కమిటీ సభ్యులు, గ్రామస్థులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

### వైభవంగా గంగమ్మజాతర...

# టీటీడీ అలంకరణలో జాతరకు కొత్త కళ



నగరి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త: నగరి పట్టణంతో పాటు పరిసరాల్లో ఉన్న 72 గ్రామాల్లో గంగమ్మజాతర వేడుకలు బుధ వారం వైభవంగా జరిగాయి. డప్పు వాయి ద్యాలు, బాణసంచా పేలుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ మంగళవారం రాత్రి గంగమ్మ ఊరి మధ్యలో వేసిన వేపాకు గుడిసెకు వచ్చి చేరింది. మంత్రి రోజా సహకా రంతో నగరి పట్టణంలో గంగమ్మకు ఈ ఏడాది టీటీడీ వారు శ్వేత వస్త్రాలు అందిస్తూ పుష్పాలంకరణ, చలువ పందిళ్ల ఏర్పాటు, పెండియాల్స్ ఏర్పాటు బాధ్యతలు స్వీకరించారు. దీంతో అమ్మవారి వేపాకు గుడిసె వద్ద టీటీడీ వారు ప్రత్యేకంగా చేపట్టిన పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి వేపాకు సారెలు, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కుబడితో విచిత్ర వేషధారణలోవచ్చిన భక్తులు జాతరలో సందడి చేశారు. బలి అన్నం సమర్పించే సమయంలో రద్దీ ఎక్కువైంది. రాత్రి గంగమ్మను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి పొలిమేర దాటించారు. జాతరను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన భారీ రంగుల రాట్నాలు చిన్నారులను అలరించాయి. గంగమ్మకు టీటీడీ ద్వారా అందజేసిన సారెను మంత్రి రోజా టీటీడీ సారెను జాతర నిర్వాహకులకు అందజేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

# శ్రీవకుళమాతను దర్శించుకున్న తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



తిరుపతిరూరల్, సెప్టెంబర్13 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ పేరూరు బండపై వెలసియున్న శ్రీవకుళమాతను బుధవారం తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మోహిత్‌రెడ్డికి ఆలయ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేసారు. దర్శనానంతరం మోహిత్‌రెడ్డి ఆలయ పరిసరాలను పరిశీలించారు.భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆలయ పరిసరాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప మండలాధ్యక్షుడు విదుదల మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ కుంబాభిషేక మహోత్సవం

గుడుపల్లె, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : మండలంలోని సంగనపల్లి పంచాయతీ మల్లప్పకొండపై వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ కుంబాభిషేక మహోత్సవాలు ఘన ంగా ముగిశాయి. బుధవారం వేదబ్రహ్మశ్రీ బాలసుబ్రమణ్యశాస్త్రి నేతృత్వంలో ఆలయంలో ప్రాత:కాలార్చన, నాడీ సంధానం, మూర్తి, దీక్షా, కళాహోమాలు, మహాప్రాణప్రతిష్ట, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం మహాకుంబా భిషేక మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి విశేష పూజలు, మహామంగళహారతి నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున ఆలయ కమిటీ అధ్వర్యంలో అన్నదానం జరిపారు. కార్యక్రమాల్లో రాష్ట్ర అటవీ,గనులు,విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,చిత్తూరు ఎం.పి. నల్లకొండగారి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్, మాజీ టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్, ఎంపిపిలు వరలక్ష్మి, అశ్విని, జడ్పీటిసిలు కృష్ణమూర్తి, ఎడిఎస్ శరవణ, కన్వీనర్ రామకృష్ణ, కో కన్వీనర్ రామూర్తి, సర ్పంచ్ అమర్‌నాథ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తి ప్రవర్తలతో గంగజాతర



పుత్తూరురూరల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని బజారు వీధిలో వెలసిన గంగమ్మ మండపం వద్ద బుధవారం భక్తితో గంగమ్మజాతర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. బుధవారం వేకువజామున గంగమ్మ మండ పం వద్ద అమ్మవారిని ప్రతిష్టించి విశేష పూజలు చేశారు. అలాగే అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణలు చేశారు. మధ్యాహ్నం మండపం సమీపంలో కుంభాలు వేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులు అమ్మవారికి విశేష పూజ లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గంగజాతర కమిటీ వారు భక్తులకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



**గంగమ్మను దర్శించుకున్న గాలి భానుప్రకాష్:** గంగజాతర సందర్భంగా నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ గంగమ్మను దర్శించుకుని విశేష పూజలు చేశారు. అలాగే గేటు పుత్తూరులో నిర్వహించిన గంగమ్మ జాతర కూడా హాజరై విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు గాలి జీవరత్నంనాయుడు, గోపి ఆచారి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.



**గంగమ్మను దర్శించుకున్న మంత్రి రోజా:** గంగజాతరలో అమ్మవారికి విశేష పూజలు మంత్రి రోజా చేశారు. ఆలయ కమిటీ వారు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి గంగమ్మ అమ్మవారికి చీర, సారెతో సమర్పించి విశేష పూజలు చేశారు. మంత్రితో పాటు మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్లు జయప్రకాష్, శంకర్, కౌన్సిలర్లు ఏకాంబరం, శివాలయ ఛైర్మన్ కొడగంటి రమేష్‌బాబు, నాయకులు థియేటర్ మురళి, ఎన్.ఆర్.చిన్న ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

**గంగమ్మను దర్శించుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి**



గంగమ్మకు డిప్యూటీ సీఎం నారాయణ స్వామి విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అలాగే శ్రీశైలం ఛైర్మన్ చక్రపాణిరెడ్డి జాతరలో పాల్గొని విశేష పూజలు చేశా రు. వైసీపీ బీసీసెల్ ప్రధాన కార్యదర్శి డి.ఎన్.ఏళుమలై, తడుకు మాజీ సర్పంచ్ రవిశేఖర్‌రాజు, మాజీ కౌన్సిలర్ నారాయణ, బాబు, శంకర్‌లు హాజరై విశేష పూజలు చేశారు. వారికి ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. గంగజాతర సందర్భంగా మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు తనయుడు గాలి జగదీష్ అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆయనకి ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. ఆయనతో పాటు విజయశేఖర్‌నాయుడు, రాజా, సాయి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నిషిధరాజు సురేంద్రరాజు అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆయనతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# అభివృద్ధి బ్రాండ్ జగనన్న : ఎంఎల్ఏ బియ్యపు

శ్రీకాళహస్తి రూరల్,సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజక వర్గంలో జగనన్న సంక్షేమ పథకాలకు జనం నుంచి విశేష స్పందన వస్తుందని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధ నరెడ్డి అన్నారు. అభివృద్ధికి బ్రాండ్ జగనన్న. కాదని ఎవరైనా చెప్పగలరా? ఎవరో గుర్తింపు లేని వ్యక్తులు వేదికలెక్కి ఏదేదో కూస్తున్నారని ధ్వజమెత్తారు. జగనన్న అధికారం చేపట్టిన తరువాతనే అభివృద్ధి జరుగుతుందని ఆర్థిక అభివృద్ధి జరుగుతుందన్నారు. బుధవారం శ్రీకాళహస్తి మండలంలోని మంగళపురి, దొమ్మర పాళెంలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఇంకేం కోరుకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అర్హత ఉండి ఏ ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందలేదంటే అధికారులను ఇంటికి పంపుతామని శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోనూ, పాపానాయుడు పేట పరిసర ప్రాంతాల్లో నేడు జరుగుతున్న అభివృద్ధి ఎప్పుడైనా జరిగిందా? అని ప్రశ్నించారు. ఇక్కడ జగనన్న ఇక్కడ పరిశ్రమలను ఏర్పాటు చేయటంతో ప్రత్యేక గుర్తింపు వచ్చిందని వివరించారు. వైకాపా నాయకులు ఎంపిడిఓ,మండల సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు భారీ ఎత్తున స్వాగతం ఏర్పాటు చేసారు. ఇంటింటి వద్ద మహిళలు హారతులిస్తూ స్వాగతం పలికారు. ప్రజలు పూల వర్షంతో ముంచెత్తారు.ఈ సందర్భంగా జడ్‌పిటిసి సుబ్బారెడ్డి సారథ్యంలో స్వాగతం పలికారు. ఎంఎల్‌ఏ మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజక వర్గాన్ని దీర్ఘకాలం తెలుగుదేశం పార్టీ ఒకే కుటుంబం పరిపాలించింది. జగనన్న పాలనలో వేలాది మందికి పక్కాగృహాలు, సంక్షేమ పథకాలతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కోసం పరిశ్రమలు, విద్యా సంస్థలు, విమానాశ్రయం అభివృద్ధి,కేంద్ర విద్యాసంస్థలు వచ్చాయన్నారు.పరిశ్రమల స్థాపనతో మండలం లోని వేలాది మంది నిరోద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించారని జనానికి వివరిస్తున్నారు.మండలంలో పెద్ద పెద్ద పరిశ్రమలతో, నేడు ఎందరు నిరుద్యోగులు జీవనోపాధి కల్గి ఉన్నారని వివరించారు. మీ సమస్యలుంటే నాదృష్టికి తీసుకురమ్మని ఎంఎల్‌ఏ పిలుపు నిస్తూ తన మొబైల్ నెంబర్‌ను అందిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయి మాయ గాళ్ళు వస్తారు. మభ్యపెడతారు. ఎన్నికలు ముగిసిన తరువాత హైదరాబాదుకు బయలు దేరుతారు. ఎప్పుడూ మీకుఅందుబాటులో ఉంటే నాయకుడు కావాలా? చుట్టపుచూపుగా వచ్చే నాయకులు కావాలో తెల్చుకోవాల్సి న ఎన్నికలు త్వరలో రాబోతున్నా యని చైతన్య పరుస్తున్నారు.ఈ కార్యక్రమాల్లో జడ్‌పిటిసి వెంకటసుబ్బారెడ్డి సర్పంచ్‌లు రవిశేఖర్, భాగ్యశ్రీ,నాయకులు మనోహర్, ఆనంద్, గుండుమల్లి, రవి,ప్రవీణ్, రమేష్, పుల్లయ్య, పెంచులయ్య, కోటి,వెంకటేష్,మహేష్, సతీష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన హరిత



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : తిరుపతిలోని పోలింగ్ స్టేషన్లు అన్నీ సక్రమంగా ఉన్నాయా లేవా అని పరిశీలించి నివేదిక తయారు చేయాలని తిరుపతి ఓటర్ నమోదు అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. బుధవారం తిరుపతి నియోజకవర్గ ఓటర్ల నమోదు అదనపు అధికారులతో, మున్సిపల్ రెవెన్యూ అధికారులు, ఆర్‌ఐలతో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ంలో తిరుపతి నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతి నగరంలో 265 పోలింగ్ బూత్‌లు 109 ప్రదేశాల్లో వున్న విషయాన్ని ప్రస్తావిస్తూ ప్రతి ఒక్క పోలింగ్ బూత్‌ను టీమ్‌గా ఏర్పరిచిన అధికారులు స్వయంగా వెళ్లి పరిశీలించి వెంటనే తనకు నివేదిక ఇవ్వాలని, తానే స్వయంగా ప్రతి ఒక్క పోలింగ్ బూతును గురువారం నుండి పరిశీలించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ లిస్టులో ఉన్న పోలింగ్ బూతులు నిర్వహించే భవనాలు పటిష్టంగా ఉన్నాయో లేవా అని పరిశీలించాలని, ఆయా పోలింగ్ బూతుల పేర్లు ఏమైనా మారి వున్నాయా అని నిర్ధారించుకోవాలని, ఒకవేళ మారి ఉంటే వాటి వివరాలను జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి వెంటనే తీసుకెళ్లాలని సూచించారు. అదే విధంగా ఆయా పోలింగ్ బూతులు ప్రభుత్వ భవనాల్లో వున్నాయా, ఏవైనా ప్రైవేట్ భవనాల్లో వున్నాయా అనే వివరాలు తీసుకోవాలన్నారు. ఓటర్ల సంఖ్య 1400 దాటిన పోలింగ్ బూత్‌లను గుర్తించి, దగ్గర్లోని వేరే పోలింగ్ బూత్‌కి మార్చేందుకు నివేదిక తయారు చేయాలన్నారు.తిరుపతి నియోజకవర్గం ఓటర్ల నమోదు అదనపు అధికారులు డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, అర్బన్ ఎంఆర్‌ఓ వెంకటరమణ, మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు కెఎల్ వర్మ, సేతుమాధవ్, డిటి జీవన్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.